సాక్షి
నల్లగొండ
శనివారం । 13 । మే । 2023



భువనగిరికి శివ మృతదేహం

గతనెల 30న సౌదీలో మరణించిన భువనగిరికి చెందిన శివ మృతదేహం శుక్రవారం స్వగ్రామానికి చేరింది. - IIలో



ఇద్దరు దొంగల అరెస్టు

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను చివ్వెంల పోలీసులు శుక్రవారం పట్టుకొని అరెస్ట్ చేశారు. - IIలో

గరిష్ఠం/కనిష్ఠం
42°/27°

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

27, 28 తేదీల్లో మెగా జాబ్ మేళా

రామగిరి(నల్లగొండ): నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ఈ నెల 27, 28 తేదీల్లో హైదరాబాద్‌లో మెగాజాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి నంద పద్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు www.kaushalmahotsav.nsdcdigital.org/telangana/candidate-registration పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకుని హైదరాబాద్ శివం రోడ్డు, విద్యానగర్‌లో గల ఎన్ఎస్‌టీఐలో నిర్వహించే జాబ్ మేళాకు హాజరుకావాలని పేర్కొన్నారు.

పాఠశాలల్లో పనులు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నల్లగొండ : పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మన ఊరు – మన బడి, మనబస్తీ – మనబడి కార్యక్రమం కింద ఎంపిక చేసిన పాఠశాలల్లో పెండింగ్ పనులపై పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, విద్య, మౌలిక వసతులు, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారులతో సమీక్షించారు. మోడల్ పాఠశాలల్లో చిన్న చిన్న పనులు ఉంటే త్వరగా పూర్తి చేసి ప్రారంభించాలని కోరారు. మొదటి విడత ఎంపిక చేసిన పాఠశాలల్లో స్కూళ్ల పునఃప్రారంభం నాటికి పూర్తి చేయాలన్నారు. రూ.30 లక్షల పైబడిన పనులకు వెంటనే టెండర్ ఖరారు చేసి పనులు మొదలు పెట్టాలని ఆదేశించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా, డీఈఓ భిక్షపతి, పంచాయతీరాజ్ ఎస్ఈ, ఏఓ ప్రకాష్ పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీలకు ఏర్పాట్లు చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నల్లగొండ : రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించనున్న చీఫ్ మినిస్టర్ కప్–2023 క్రీడా పోటీలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో నిర్వహించనున్న సీఎం కప్ క్రీడాపోటీలపై శుక్రవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసి వారిని మరింత ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సీఎం కప్–2023ను ఈనెల 15 నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలస్థాయిలో మే 15 నుంచి 17వరకు, జిల్లా స్థాయిలో మే 22 నుంచి 24 వరకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల స్థాయిలో నిర్వహించే పోటీలకు స్థలాలను గుర్తించాలని డీపీఓ, జెడ్పీ సీఈఓలను ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ ప్రసాదరావు, ఆర్‌డీఓ జయచంద్రారెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీపీఓ విష్ణువర్ధన్ రెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ కొండల్‌రావు, డీఆర్‌డీఓ కాళిందిని, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి మక్బూల్ అహ్మద్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చడం అభినందనీయం



విద్యార్థినులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

నల్లగొండ రూరల్ : రాష్ట్రస్థాయిలో విద్యార్థులు ప్రతిభ చూపడం అభినందనీయమని మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ఘనశ్యాం అన్నారు. ఇటీవల నిర్వహించిన జిజ్ఞాస విద్యార్థుల స్టడీ ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు విజేతలుగా నిలిచినందుకు శుక్రవారం వారిని కళాశాలలో అభినందించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు ఈనెల 16న హైదరాబాద్‌లో నగదు బహుమతి అందిస్తారని ఆయన తెలిపారు. ప్రతిభ చూపినవర ఆరీఫా, అనూష, తంకినాథ్, శేతశ్రీ, వనంరాణి, నిఖిత, సోఫియా, స్నేహ, గిరిజ, అఖిల, జ్యోతి తదితరులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు భాస్కర్‌రెడ్డి, జబీన్, సుంకరి రాజారాం తదితరులు ఉన్నారు.

• ఘనంగా నైటింగేల్ జయంతి



ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కేక్ కట్ చేస్తున్న నర్సులు

నల్లగొండ టౌన్ : మానవతామూర్తి ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతి (అంతర్జాతీయ నర్సుల దినోత్సవం) సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నైటింగేల్ చిత్రపటానికి పలువురు నర్సులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లచ్చు నర్సులు నిస్వార్థంతో చేస్తున్న సేవలను కొనియాడారు. ఫ్లోరెన్స్ నైటింగేల్‌ను ఆదర్శంగా తీసుకుని నర్సులు ఆస్పత్రికి వచ్చే రోగుల విషయంలో సేవాభావంతో మెలగాలని సూచించారు. ఉత్తమ సేవలను అందించిన పలువురు నర్సులను డాక్టర్ లచ్చు సన్మానించారు.

• బతుకమ్మతో నిరసన



కలెక్టరేట్ ఎదుట బతుకమ్మ ఆడుతూ నిరసన తెలుపుతున్న కార్యదర్శులు

నల్లగొండ : గ్రామ పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. 15వ రోజు కొనసాగిన సమ్మెకు బీఎస్పీ రాష్ట్ర మహిళా విభాగం కన్వీనర్ కవిత, ఎస్సీ, ఎస్టీ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కొంపల్లి భిక్షపతి, బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ యాదవ్, బీసీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు శంకర్‌గౌడ్, ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివకుమార్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నాలుగు సంవత్సరాల ప్రొబెషనరీ కాలాన్ని సర్వీస్‌గా పరిగణిస్తూ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

అగ్రిమెంట్ ఉన్నవారికే..

నీలగిరిలో మున్సిపల్ షాపుల వేలంపై మార్గదర్శకాలు జారీ

- లీజు షాపుల క్రమబద్ధీకరణకు నోటీసులు ఇస్తున్న అధికారులు
- వారం రోజుల పాటు కొనసాగనున్న ప్రక్రియ
- ఆ తర్వాత దరఖాస్తుల స్వీకరణ
- అన్నీ సవ్యంగా ఉంటేనే రెగ్యులరైజేషన్



వ్యాపారులకు నోటీసులు అందజేస్తున్న మున్సిపల్ సిబ్బంది

నల్లగొండ టూటౌన్ : నీలగిరి మున్సిపాలిటీకి చెందిన లీజు షాపుల క్రమబద్ధీకరణ కోసం కలెక్టర్ మున్సిపాలిటీకి మార్గదర్శకాలు జారీ చేశారు. నాలుగున్నర దశాబ్దాల క్రితం షాపు లీజుకు తీసుకున్నప్పుడు చేసుకున్న అగ్రిమెంట్ పత్రం ఉన్న వారికే క్రమబద్ధీకరణ అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వాటిని అనుసరించి మున్సిపల్ అధికారులు షాపులను లీజుకు తీసుకున్న వారికి నోటీసులు జారీ చేస్తున్నారు. మున్సిపాలిటీకి చెందిన 234 దుకాణాలను నాలుగున్నర దశాబ్దాల క్రితం లీజుకు తీసుకున్న వారికి క్రమబద్ధీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. దాంతో సంబంధిత వ్యాపారులకు వారం రోజుల పాటు నోటీసులు ఇచ్చిన తరువాత వారు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించనున్నారు. షాపు క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తులు చేసుకునే సమయంలోనే దరఖాస్తు వెంట లీజు అగ్రిమెంట్ పత్రం జత చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఒక వేళ లీజు అగ్రిమెంట్ పత్రం లేకుంటే సంబంధిత దరఖాస్తులను పక్కన పెట్టాల్సి ఉంటుంది.

అన్నీ చూసుకునే నోటీసులు..

నాలుగున్నర దశాబ్దాల క్రితం షాపులను లీజుకు పొందిన వ్యాపారులు కొందరు నల్లగొండ పట్టణంలో ఉండగా.. మరి కొందరు హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు వెళ్లి స్థిరపడ్డారు. ఇతర ప్రాంతాలకు వెళ్లి స్థిరపడిన వారి స్థానంలో కొందరు కొత్త వారు వచ్చి దుకాణం తమదేనని మున్సిపల్ సిబ్బందిని బురిడీ కొట్టించే ప్రయత్నాలు కూడా చేస్తున్నారు. అదే విధంగా దుకాణాలు లేకున్నా నోటీసులు ఇవ్వాలని మున్సిపల్ కార్యాలయానికి వస్తుండడం విశేషం. ఇలా ఇద్దరు, ముగ్గురు వచ్చి తమకు నోటీసులు ఇవ్వాలని మున్సిపల్ సిబ్బందిని కోరగా దుకాణాలు ఎక్కడున్నాయని ప్రశ్నించడంతో పొంతన లేని సమాధానాలు చెప్పి పలాయనం చిత్తగించారు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా మంచం మీది నుంచి లేవలేని వృద్ధులు ఉన్నాసరే సంబంధిత కుటుంబ సభ్యులకు ఇవ్వకుండా మున్సిపల్ సిబ్బంది వారి ఇంటికే వెళ్లి నోటీసులు అందజేసి ఫొటోలు తీసుకుంటున్నారు. ఎక్కడ చిన్న పొరపాటు జరిగినా నోటీసుల జారీ సమస్య జటిలంగా మారే ప్రమాదం పొంది. అలాంటి వివాదాలకు ఆస్కారం లేకుండా ఉండాలనే కారణంతో లీజు అగ్రిమెంట్ చేసుకున్న వారు ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లి నోటీసులు అందజేస్తున్నారు. లీజు షాపుల క్రమబద్ధీకరణ అంశం అత్యంత క్లిష్టంగా మారిందని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు.

నిబంధనల ప్రకారమే క్రమబద్ధీకరణ



ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనల ప్రకారమే లీజుకు పొందిన వ్యాపారులకు షాపులను క్రమబద్ధీకరిస్తాం. ప్రస్తుతం లీజుకు పొందిన వారికి నోటీసులు అందజేస్తున్నాం. లీజు అగ్రిమెంట్ ఉన్న వారికే క్రమబద్ధీకరణ చేస్తాం. అగ్రిమెంట్ లేని వాటిపై ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నిర్ణయం తీసుకుంటాం.

– రమణాచారి, మున్సిపల్ కమిషనర్

కోర్టులో కేసు లేకుంటేనే క్రమబద్ధీకరణ..

లీజు దుకాణాల క్రమబద్ధీకరణ కోసం మున్సిపాలిటీ అగ్రిమెంట్ ఉన్నా సంబంధిత దుకాణంపై కోర్టులో కేసు ఉంటే దరఖాస్తులను పక్క పెట్టే అవకాశం ఉంది. కోర్టులో కేసు లేదని అఫిడవిట్‌ను దరఖాస్తుతో పాటు సమర్పించాల్సి ఉంది. కోర్టులో కేసులున్న దుకాణాలకు సంబంధించి క్రమబద్ధీకరణకు ప్రభుత్వ మార్గదర్శకాలు ఒప్పుకోవు. ఒకవేళ దుకాణాలపై కోర్టు కేసు ఉంటే దానిని ఉపసంహరించుకోవాల్సి ఉంది. కోర్టులో ఎలాంటి కేసులు లేని దుకాణాలను మాత్రమే మొదట క్రమబద్ధీకరించనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

మిల్లర్లదే ఫైనల్!

- ధాన్యం కొనుగోళ్లలో ఇష్టారాజ్యం
- తాలు, తరుగు పేర క్వింటాకు 2 నుంచి 5 కేజీల కోత
- ఇదేంటని ప్రశ్నిస్తే రోజుల తరబడి మిల్లుల వద్ద లారీల నిలిపివేత



హాలియాలోని బాలాజీ రైస్ మిల్లులో రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

నల్లగొండ : ధాన్యం కొనుగోలు వ్యవహారం అంతా మిల్లర్లు చెప్పిందే వేదంలా సాగుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరు చెప్పినా అంతిమ నిర్ణయం వారిదే అవుతోంది. అధికారులు కేంద్రాల్లో మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నా.. ధాన్యం దిగుమతి సందర్భంలో మిల్లర్లు తాలు పేర ధరను తగ్గిస్తూ వారే ఆ వడ్లకు వారే ధర నిర్ణయిస్తున్నారు. అలా కాదంటే కల్లాల నుంచి వచ్చిన ధాన్యాన్ని రోజుల తరబడి కూడా దిగుమతి చేసుకోవడం లేదు. దీంతో ధాన్యం రవాణాలో అంతరాయం ఏర్పడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

4.20 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు

జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో ధాన్యం దిగుబడి అధికంగా వస్తుండడంతో అధికారులు దానికి అనుగుణంగా 346 కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు రూ.866 కోట్ల విలువైన 4.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు ఆయా గ్రేడ్ల వారీగా ప్రభుత్వ మద్దతు ధరను నిర్ణయిస్తున్నారు. అయితే ధాన్యం తూకం వేశాక లారీలు రాకపోవడంతో రవాణా విషయంలో ఆలస్యం అవుతోంది. అనేక ఇబ్బందులను అధిగమించి కేంద్రాల నుంచి ధాన్యం మిల్లులకు వెళ్తే.. అక్కడ వారు తరుగు, తాలు పేరుతో క్వింటాకు 2 కిలోల నుంచి 5 కిలోల వరకు కూడా కోత విధిస్తున్నారు. మిల్లర్ నిర్ణయించిన ప్రకారం ఒప్పుకుంటేనే ధాన్యం దిగుమతి చేస్తున్నారు. లేదంటే రోజుల తరబడి మిల్లు వద్ద ఉండాల్సిందే. దీంతో లారీ యజమానులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వడ్లు పోసి నెల రోజులైంది



వేములపల్లి మండల కేంద్రంలోని పీఏసీఎస్ కేంద్రంలో నెల రోజుల క్రితం వడ్లు పోశాను. ఇంకా కాంటా పెట్టకుండా రోజు రేపు మాపు అంటున్నారు. హమాలీలు క్వింటా వడ్లకు రూ.45 తీసుకుంటున్నారు. అయినా ఇంకా డబ్బులు కావాలని డిమాండ్ చేస్తున్నారు. నిర్వాహకులు లారీ డ్రైవర్‌కు మామూళ్లు ఇవ్వాలంటూ ఒక్కో రైతు దగ్గర నుంచి రూ.500 తీసుకుంటున్నారు. త్వరితగతిన ధాన్యం కొనుగోలు చేసి ఆదుకోవాలి.

– మాలి చలపతిరెడ్డి, రైతు పూసలపాడు, వేములపల్లి మండలం

అధికారులు చెప్పినా..

ధాన్యం దిగుమతి విషయంలో ప్రజా ప్రతినిధులు, కలెక్టర్, ఇతర అధికారులు చెప్పినా మిల్లర్లు పట్టించుకోవడం లేదు. యథావిధిగా కోతలు విధిస్తూనే ఉన్నారు. రోజుల తరబడి ధాన్యాన్ని దిగుమతి చేసుకోవడం లేదు. దీంతో తూకం వేసిన ధాన్యం రోజుల తరబడి కేంద్రాల్లోనే ఉంటోంది. దీంతో కాంటాల్లో జాప్యం జరుగుతోంది. ధాన్యం దిగుమతి విషయంలో అధికారులు కఠిన నిర్ణయాలు తీసుకుంటే తప్ప రైతులకు న్యాయం జరిగే పరిస్థితి లేదు.

ధాన్యం దిగుమతి చేసుకోవాలి

హాలియా : రైతులు ఇబ్బంది పడకుండా మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు కోరారు. శుక్రవారం అనుముల మండలంలోని కొత్తపల్లి సమీపంలో ఉన్న శ్రీ బాలాజీ రైస్ మిల్లును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మిల్లర్లు ధాన్యం దిగుమతుల్లో ఆలస్యం చేయవద్దన్నారు. అవసరమైతే హమాలీల సంఖ్య పెంచుకొని, అదనపు గోదాములు చూసుకోవాలని సూచించారు. నాణ్యత పేరుతో తరుగు తీస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దార్ మంగ తదితరులు ఉన్నారు.

నిడమనూరులో అత్యధిక ఉష్ణోగ్రత



నల్లగొండలోని ఎన్జీ కళాశాల ఎదుట మధ్యాహ్నం వేళ నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

నల్లగొండ టౌన్ : జిల్లాలోని నిడమనూర్ మండలంలో శుక్రవారం అత్యధికంగా 43.9 డిగ్రీల సెల్సీఎస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఉక్కపోత, ఎండ తీవ్రత కారణంగా జిల్లాలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కట్టంగూర్‌లో 43.5 తిప్పర్తి మండలం పజ్జూరులో 42.4, కేతేపల్లి 42.2 , దామరచర్లలో 42.2, నల్లగొండ 42.1, హాలియాలోని ఇబ్రహీంపేటలో 42.0, నిడమనూరు మండలం తుమ్మడంలో 41.9, ముదిగొండ 41.8, చందంపేట 41.6, నాంపల్లి 41.4, హాలియా 41.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. కనగల్ 41.2, నకిరేకల్ 40.6, మునగాల 40.5, చండూర్ 40.4, నార్కట్‌పల్లి 40.4, కొండమల్లేపల్లి 40.3, గుర్రంపోడు 40.3, నేరడుగొమ్ము 40.2, నకిరేకల్ 40.1, శాలిగౌరారం 39.1, డిండి 39.0 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఎండల తీవ్రత పెరగడంతో మధ్యాహ్నం వేళ జనం ఇంటి నుంచి బయటికి రావడం లేదు. ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఖాళీల భర్తీకి మంత్రి హామీ

రామగిరి(నల్లగొండ) : జిల్లాలోని గ్రంథాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి మంజూరుకు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి హామీ ఇచ్చినట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ కార్యాలయ ప్రారంభోత్సవానికి హాజరైన మంత్రి సబితా ఇంద్రారెడ్డిని మల్లికార్జున్‌రెడ్డి కలిశారు. జిల్లా గ్రంథాలయ సంస్థకు రావాల్సిన సెస్ నిధులపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో సీనియర్ అసిస్టెంట్ ఎస్.నర్సింహారెడ్డి, గ్రంథపాలకుడు ఎం.శ్రవణ్‌కుమార్ ఉన్నారు.



మంత్రికి వినతి పత్రం ఇస్తున్న మల్లికార్జున్‌రెడ్డి

స్పిల్‌వే, గేట్లను పరిశీలించిన ఈఎన్‌సీ

నాగార్జునసాగర్ : దశాబ్ద కాలం తర్వాత రూ.20 కోట్లతో చేపడుతున్న నాగార్జునసాగర్ ప్రాజెక్టు స్పిల్‌వే మరమ్మతు పనులను ఈఎన్‌సీ (ఇంజినీర్ ఇన్ చీఫ్) నాగేంద్ర శుక్రవారం పరిశీలించారు. 25 గేట్ల దిగువ భాగాన కొనసాగుతున్న మరమ్మతు పనుల్లో వేగం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సాగర్ డ్యాం ఇంజనీర్లను ఆదేశించారు. రెండు షిఫ్టుల్లో పదహారు గంటలు పనిచేస్తున్నప్పటికీ అనుకున్న మేరకు పనులు జరగడం లేదని, వరదలు వచ్చే సమయానికి పనులు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ప్రాజెక్టు కుడి కాల్వకు అమర్చుతున్న గేట్ల పనులను పరిశీలించారు. ఆయన వెంట సీఈ అజయ్‌కుమార్, ఎస్ఈ ధర్మా, డీఈలు సుదర్శన్, పరమేష్, శ్రీనివాసరావు, జేఈలు సత్యనారాయణ, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.



స్పిల్‌వేను పరిశీలిస్తున్న ఈఎన్‌సీ నాగేంద్ర

యాదాద్రిలో వైభవంగా ఊంజలి సేవ

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం ఆండాల్ అమ్మవారి తిరువీధి, ఊంజలి సేవోత్సవాన్ని ఆచార్యులు వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ఇష్టమైన రోజు కావడం ప్రత్యేకంగా అలంకరించి, ఆలయ మాఢ, తిరువీధిలో ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలో ఊంజలి సేవోత్సవం చేపట్టారు. అదే విధంగా వేకువజామున స్వామివారికి సుప్రభాతం, ఆరాధన, అభిషేకం తదితర కైంకర్యాలు గావించారు. రాత్రి స్వామివారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని మూసివేశారు.

సమర్థవంతంగా సేవలందించాలి

- ఎస్పీ అపూర్వరావు



సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ అపూర్వరావు

గుర్రంపోడు, కొండమల్లేపల్లి, పెద్దఅడిశర్లపల్లి : పోలీసుశాఖ గౌరవం మరింతగా పెరిగేలా సిబ్బంది సమర్థవంతంగా సేవలందించాలని ఎస్పీ అపూర్వరావు సూచించారు. శుక్రవారం ఆమె గుర్రంపోడు, కొండమల్లేపల్లి, పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్ వద్ద గల గుడిపల్లి పోలీస్‌స్టేషన్లను ఆమె సందర్శించి రికార్డులను తనిఖీ చేసి సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకుని పలు సూచనలిచ్చారు. ఆయా చోట్ల సీసీ కెమరాలను పరిశీలించి మరిన్ని సీసీ టీవీలు ఏర్పాటు చేసేలా కృషి చేయాలన్నారు. శాంతి భద్రతల విషయంలో ఎలాంటి సమస్య ఉన్నా పోలీస్‌స్టేషన్‌లోగానీ, ఎస్పీ కార్యాలయంలోగానీ సందర్శించవచ్చని తెలిపారు. పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించడానికి ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. కేసులను త్వరితగతిన పరిశీలించి ఫిర్యాదుదారులకు న్యాయం చేయాన్నారు. కొండమల్లేపల్లిలో 107 సర్వే నెంబర్‌లో పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని ఎస్పీ పరిశీలించారు. ఆమె వెంట దేవరకొండ డీఎస్పీ నాగేశ్వర్‌రావు, మల్లేపల్లి సీఐ శ్రీనివాసులు, ఎస్ఐలు వీరబాబు, శివకుమార్, రంజిత్‌రెడ్డి ఉన్నారు.

పొదుపు పేర టోకరా..!

- మిర్యాలగూడలో బోర్డు తిప్పేసిన సహకార పొదుపు సంఘం
- రూ.లక్షల్లో బకాయిలు.. న్యాయం చేయాలని బాధితుల వేడుకోలు



పొదుపు సంఘం పుస్తకాలను చూపిస్తున్న బాధితులు

మిర్యాలగూడ : పిల్లల భవిష్యత్తు కోసం రూపాయి.. రూపాయి కూడబెట్టుకుని పొదుపు చేసుకున్న మహిళలకు మదర్ థెరిస్సా మహిళా పరస్పర సహాయక సహకార పొదుపు సంఘం బోర్డు తిప్పేసి తీవ్ర అన్యాయం చేసింది. తమ పిల్లల భవిష్యత్తు కోసం కట్టిన డబ్బులను తిరిగి ఇప్పించి న్యాయం చేయాలని బాధితులు ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసులు చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయింది. మిర్యాలగూడలో మదర్ థెరిస్సా మహిళ పరస్పర సహాయక సహకార పొదుపు సంఘం (పరిమిత) 30 సంవత్సరాల క్రితం ఏర్పడింది. ఈ సంఘంలో 15 నెలలపాటు నెలకు రూ.100 చొప్పున పొదుపు చేయాలని నిబంధన ఉంది. ఆ తర్వాత కూడా కొనసాగవచ్చు. అయితే అవసరం ఉన్న వారికి సంఘం నుంచి రూ.5 వేల నుంచి రూ.1లక్ష వరకు రెండు రూపాయల వడ్డీకి రుణం ఇచ్చేవారు. ఒకపక్క పొదుపు మరోపక్క అవసరానికి రుణం అందుతుండడంతో పేద, మధ్య తరగతి కుటుంబాలు పొదుపు సంఘంలో చేరారు. ఇలా మిర్యాలగూడ పట్టణంలో 30 సంఘాలను ఏర్పాటు చేశారు. ఒక్కో సంఘంలో 100 నుంచి 150 మంది వరకు సభ్యులు ఉన్నారు. ఈ సంఘం వేలాది మంది వద్ద నుంచి కోట్లాది రూపాయలు పొదుపు రూపంలో వసూలు చేసింది. గత సంవత్సరం మే నెలలో బోర్డు తిప్పేసింది.

కేసులు పెట్టినా ఫలితం శూన్యం..

పొదుపు సంఘం బోర్డు తిప్పేయడంతో న్యాయం కోసం బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ న్యాయం జరగడం లేదు. కొంతమంది సభ్యులు తీసుకున్న రుణం చెల్లించలేదు. సంవత్సరకాలంలో తమ డబ్బులు తమకు ఇప్పించాలని బాధితులు పోలీసులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం దక్కడం లేదు. ఇటీవల మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని కేశవనగర్‌లో 143 మంది ఈ పొదుపు సంఘంలో సభ్యులు మిర్యాలగూడ రూరల్ పోలీసులను ఆశ్రయించారు. గ్రామంలో మొత్తం సుమారు రూ.20 లక్షల మేర పొదుపు సంఘం బకాయి పడి ఉందని ఫిర్యాదు చేశారు.

నాకు రూ.50వేలకు పైగా రావాలి



పొదుపు సంఘంలో 20 సంవత్సరాలుగా పొదుపు చేసుకున్నా. గతంలో సంఘం సభ్యులకు రుణాలు బాగానే ఇచ్చారు. అందరికీ నమ్మకం కలిగిన తరువాత సంఘంలో సభ్యులు పెద్ద ఎత్తున చేరారు. వేలాది రూపాయల పొదుపు చేయడంతో తిరిగి చెల్లించలేక సంఘం బోర్డు తిప్పేసింది. నాకు రూ.50వేలకు పైగా రావాల్సి ఉంది.

– అంజమ్మ, కేశవనగర్

డబ్బులు ఇప్పించి ఆదుకోండి



నేను 15 సంవత్సరాలుగా సంఘంలో పొదుపు కట్టాను. నాకు రూ.70 వేలకు పైగా రావాల్సి ఉంది. డబ్బులు ఇవ్వాలని అనేకసార్లు మొరపెట్టుకున్నా సంఘం వారు పట్టించుకోవడం లేదు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేశారు. నా కూతురు పెళ్లి ఖర్చుల కోసమని పొదుపు చేశా. అధికారులు తగు చర్యలు తీసుకొని డబ్బులు ఇప్పించాలి.

– వెంకటమ్మ, కేశవనగర్

క్లుప్తంగా

బీజేపీ సర్కార్‌తో రాష్ట్రానికి మేలు

- మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



రాజగోపాల్ రెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

వలిగొండ: మునుగోడు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి శుక్రవారం వలిగొండ మండల కేంద్రానికి వచ్చిన సందర్భంగా బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పాలనపై ప్రజలు విసుగు చెందారని, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్ర ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాగేలి సుధాకర్, బంధారపు లింగస్వామి, భిక్షం, సీఎస్ రెడ్డి, దంతూరి సత్తయ్య, పోలు నాగయ్య, అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

మునుగోడులో నకిలీ నోట్ల కలకలం



బ్యాంక్ సిబ్బంది గుర్తించిన నకిలీ నోటు

మునుగోడు: వారం రోజులుగా కొత్త వంద రూపాయల నోట్లు మునుగోడు మండల కేంద్రంలో అధికంగా చెలామణి అవుతున్నాయి. వ్యాపారులు తమ వద్దకు వచ్చిన డబ్బును బ్యాంకులో డిపాజిట్ చేసుకుందామని బ్యాంకుకు వెళ్లగా.. అందులో కొన్ని నకిలీవని తేలుతున్నాయని వారు పేర్కొంటున్నారు. ఇటీవల దాదాపు 30కిపైగా నకిలీ వంద రూపాయల నోట్లు రావడంతో బ్యాంక్ అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో శుక్రవారం ఇద్దరు వ్యాపారులు మునుగోడులోని బ్యాంకులో డబ్బులు డిపాజిట్ చేయడానికి రాగా.. అందులో ఒకరి వద్ద 15 రూ.100 నోట్లు, ఇంకో వ్యాపారి దగ్గర నకిలీ రూ.100 నోటు రావడాన్ని బ్యాంకు సిబ్బంది గుర్తించారు. ఇలా బ్యాంకుకు వచ్చిన నోట్లే కాకుండా వ్యాపారుల వద్ద అనేకంగా నకిలీ నోట్లు ఉండవచ్చని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నకిలీ నోట్లు చెలామణి చేస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోకపోతే అమాయక ప్రజలు మోసపోయే ప్రమాదం ఉందని మండల వాసులు పేర్కొంటున్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీ

పెద్దవూర: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం నల్లగొండ జిల్లా విద్యుత్ విజిలెన్స్, మిర్యాలగూడెం ఆపరేషన్ వింగ్ ఆధ్వర్యంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈమేరకు పలువురిపై కేసులు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారి స్వాతి, ట్రాన్స్‌కో ఏఈ దాసయ్య తెలిపారు. మండలంలోని పెద్దవూర, తుంగతుర్తి, చలకుర్తి, పాల్తీతండా, పులిచర్ల, తెప్పలమడుగు, పూలగూడెం, పొట్టివానితండా, లింగంపల్లి, చిన్నగూడెం, పెద్దగూడెం, పోలేపల్లి, నీమానాయక్‌తండా, చింతపల్లితండా గ్రామాల్లో దాడులు నిర్వహించగా.. 121 మంది విద్యుత్ చౌర్యం, 39 మంది అధిక లోడ్ వాడుతూ పట్టుబడినట్లు తెలిపారు. విద్యుత్ చౌర్యం కింద రూ.5లక్షలు, కంపౌండ్ ఫెనాల్టీ కింద రూ.2లక్షలు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. 30 మంది విద్యుత్ అధికారులు, సిబ్బంది 15 బృందాలుగా ఏర్పడి దాడులు చేసినట్లు తెలిపారు. రాత్రి సమయంలో కూడా విద్యుత్ చౌర్యంపై దాడులు నిర్వహిస్తామని జిల్లా విజిలెన్స్ అధికారులు పేర్కొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు

- వారి నుంచి 13 తులాల బంగారు ఆభరణాలు, రూ.3.8లక్షల నగదు స్వాధీనం
- కేసు వివరాలు వెల్లడించిన సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్

సూర్యాపేట క్రైం: చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను చివ్వెంల పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రాజేంద్రప్రసాద్ వెల్లడించారు.

2022, అక్టోబర్ 10న చివ్వెంల మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన రణబోతు కనకారెడ్డి ఇంటికి తాళం వేసి, సూర్యాపేట పట్టణంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు వెళ్లాడు. అదును చూసిన దొంగలు తాళం పగలగొట్టి రూ.7.50 లక్షల నగదు, 13 తులాల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా సెల్ టవర్ డంప్‌లు పరిశీలించి.. అనుమానితులను విచారణ చేయడం ప్రారంభించారు. శుక్రవారం దురాజ్‌పల్లి సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా ఆటోలో వెళ్తున్న పెన్‌పహాడ్ మండలం మహమ్మాదాపురం గ్రామానికి చెందిన ఖమ్మంపాటి నాగేశ్వరరావు, అంగోతు నాగరాజులను అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేయగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లాకు చెందిన సయ్యద్ అల్తాఫ్ అనే వ్యక్తితో కలిసి ఈ ముగ్గురు టీమ్ గా ఏర్పడి తిమ్మాపురం గ్రామంలో ఓ ఇంట్లో దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. నిందితుల నుంచి రూ.3.80 లక్షలు, 13 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.

వివిధ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు..

ఈ ముగ్గురిపై వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనట్లు ఎస్పీ తెలపారు. ఖమ్మంపాటి నాగేశ్వరరావుపై గతంలో సూర్యాపేట్ రూరల్, టౌన్, పెన్‌పహాడ్, చివ్వెంల, కనగల్, మోతె, వనస్థలిపురం పరిధిలో మొత్తం 16 కేసులు, అంగోతు నాగరాజుపై జనగాం, భద్రాచలం, ఘట్ కేసర్, మిర్యాలగూడ, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట టౌన్, గోల్కొండ పరిధిలో మొత్తం 11 కేసులు నమోదయ్యాయని చెప్పారు. నాగేశ్వరరావు, నాగరాజులను అరెస్టు చేసి రిమాండ్ తరలించామని.. మరో నిందితుడు సయ్యద్ ఆల్తాఫ్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. కేసును ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ సిబ్బందికి సూచనలు చేసిన డీఎస్పీ నాగభూషణం, రూరల్ సీఐ సోమ్‌నారాయణసింగ్, కేసు ఛేదనలో నిర్విరామంగా పనిచేసిన ఎస్‌ఐలు విష్ణుమూర్తి, మధులను ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు. సమావేశంలో డీఎస్పీ నాగభూషనం, సీఐ సోమ్‌నారాయణసింగ్, ఎస్‌ఐలు విష్ణుమూర్తి, మధు, సిబ్బంది గొర్ల కృష్ణ, ఇరుగు బాబు, సోమయ్య, లింగయ్య, కర్ణాకర్, సైదులు, నిరంజన్ పాల్గొన్నారు.

సీబీఎస్‌ఈలో విపస్య విజయకేతనం



మందడి రమ్య



తరుణ్‌తేజ



సాక్షిశర్మ

నల్లగొండ: పదో తరగతి సీబీఎస్‌ఈ శుక్రవారం ప్రకటించిన ఫలితాల్లో నల్లగొండలోని విపస్య ది స్కూల్ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణతతో విజయకేతనం ఎగురవేశారు. మొదటిస్థానంలో మందడి రమ్య 541, ద్వితీయ స్థానంలో కొరివి తరుణ్‌తేజ 514, తృతీయ స్థానంలో సాక్షి శర్మ 503 మార్కులు సాధించారు. ఉత్తమ ప్రతిభను కనబర్చిన విద్యార్థులను ఆ పాఠశాల వ్యవస్థాపకులు బండారు ప్రసాద్, ప్రిన్సిపాల్ మాదాసు భరత్, ఉపాధ్యాయులు అభినందించారు.

మోటారు వైర్ల చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు



మోటారు వైర్లను చూపుతున్న పోలీసులు

పాలకవీడు: వ్యవసాయ విద్యుత్ మోటారు వైర్ల చోరీకి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం పాలకవీడు మండలం చెరువుతండా సమీపంలోని వ్యవసాయ భూముల వద్ద గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పదంగా సంచరిస్తున్నాడని రైతులు అందించిన సమాచారం మేరకు అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడ్డ వ్యక్తి గరిడేపల్లి మండలం వెలిదండ గ్రామానికి చెందిన పర్వతం వెంకన్నగా గుర్తించారు. స్టేషన్‌కు తరలించి విచారించడంతో జాన్‌పహాడ్ దర్గా సమీపంలో, నేరేడుచర్ల మండల పరిధిలోని మేడారం వద్ద బోరు మోటారు వైర్లు, కేబుళ్ల చోరీ చేసినట్లు అంగీకరించాడు. కాగా.. ఇతనిపై ఇప్పటికే వివిధ నేరాలపై పది కేసులు నమోదయ్యాయని ఎస్సై తెలిపారు. ఖమ్మం రూరల్ పరిధిలో మహిళను చంపి మేకలను చోరీ చేసిన ఘటనలో జైలుకు వెళ్లి బెయిల్‌పై విడుదలయ్యాడని, ఓ చోరీ కేసులో మహబూబాబాద్ జైలుకు వెళ్లి అక్కడి నుంచి తప్పించుకున్నట్లు చెప్పారు. అతని వద్ద విద్యుత్ వైర్లు, రూ.10వేల నగదు, వైర్లు కత్తిరించడానికి ఉపయోగించిన పరికరాన్ని స్వాధీనం చేసుకున్నామని, నిందితుడిపై నేరేడుచర్ల పీఎస్‌లో రెండు, పాలకవీడు పీఎస్‌లో రెండు కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

జీవాలు అమ్మి కూతురు పెళ్లి చేద్దామనుకుంటే..

- మేకలు, గొర్రెల చోరీకి పాల్పడిన గుర్తుతెలియని వ్యక్తులు



వివరాలు తెలుపుతున్న బాధిత కుటుంబం

ఆలేరురూరల్: జీవాలు అమ్ముకొని వచ్చిన డబ్బులతో తన కూతురు పెళ్లి చేద్దామనుకున్నాడు. కానీ ఇంతలో ఆ జీవాలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ సంఘటన ఆలేరు మండలంలోని కందిగడ్డతండా గ్రామంలో శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన గుగులోతు రవి బుధవారం రాత్రి 22 మేకలు, 2 గొర్రెలను తన వ్యవసాయ బావి వద్ద ఉన్న కొట్టంలోకి తోలి, కందిగడ్డ తండాలోని తన ఇంటికి వెళ్లిపోయాడు. మరుసటి రోజు ఉదయం తన బావి వద్దకు వెళ్లి చూడగా జీవాలు కనిపించలేదు. దీంతో అదేరోజు ఆలేరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని, విచారణ చేపట్టారు. గొర్రెలు, మేకల విలువ సుమారు రూ.3లక్షలు ఉంటుందని బాధిత కుటుంబం వాపోయింది. తమ జీవన ఆధారం కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈతకు వెళ్లి.. మృత్యుఒడిలోకి..

నల్లగొండ క్రైం: ఈతకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు బావిలో మునిగి మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. నల్లగొండ పట్టణ శివారులోని లెప్రసీ కాలనీకి చెందిన దర్శనం పుల్లయ్య (45) శుక్రవారం అదే కాలనీ సమీపంలో ఉన్న బావిలో ఈత కొట్టేందుకు మహేష్, రామ్‌తారలతో కలిసి వెళ్లాడు. మద్యం మత్తులో ఉన్న పుల్లయ్య ఈత కొట్టేందుకు బావిలోకి దూకి ప్రమాదవశాత్తు అందులో మునిగి మృతిచెందాడు. మృతుడి కుమార్తె బొడ్డుపల్లి రాధిక ఫిర్యాదు మేరకు మహేష్, రామ్ తారాలను విచారిస్తున్నట్లు టూటౌన్ ఎస్సై వేమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

బైక్ ట్యాంక్ కవర్‌లో పెట్టిన డబ్బులు మాయం

- నిందుతుడి కోసం గాలిస్తున్న పోలీసులు



నిందితుడి సీసీ పుటేజీ

మిర్యాలగూడ అర్బన్: బైక్ ట్యాంక్ కవర్‌లో పెట్టిన డబ్బుల సంచిని ఓ వ్యక్తి చోరీ చేశాడు. ఈ సంఘటన మిర్యాలగూడ పట్టణంలోని పోస్టాఫీస్ వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. వన్‌టౌన్ ఎస్‌ఐ శ్రీనునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని హట్యాతండాకు చెందిన రైతు లావూడి శంకర్ వరి ధాన్యాన్ని అమ్మగా వచ్చిన రూ.లక్షా 50వేలను తన బైక్ ట్యాంక్ కవర్‌లో పెట్టుకుని వస్తున్నాడు. ఈ క్రమంలో పోస్టాఫీస్ సమీపంలో బైక్ పంక్చర్ అయింది. దీంతో బైక్‌ను పంక్చర్ చేయిస్తుండగా ట్యాంక్ కవర్‌లో ఉన్న డబ్బులను గమనించిన ఓ వ్యక్తి డబ్బులను చాకచక్యంగా చోరీ చేశాడు. పంక్చర్ పూర్తయిన తరువాత తన బైక్‌లో డబ్బులు కనిపించకపోవడంతో శంకర్ వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి నుంచి ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. చోరీ దృశ్యాలు అక్కడ ఉన్న సీసీ పుటేజీలో రికార్డు కావడంతో నిందితుడి కోసం గాలిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వాటర్ ట్యాంకర్‌ను ఢీకొట్టిన బైక్..

- ఇద్దరు మృతి, మరొకరికి తీవ్రగాయాలు





మృతి చెందిన చంద్రబోయిన ప్రసన్నకుమార్, కొంద్ర నిఖిల్

చివ్వెంల (సూర్యాపేట): అతివేగంగా వస్తున్న బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంకర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందగా, ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల పరిధిలోని లక్ష్మణ్‌నాయక్ తండాలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణానికి చెందిన చంద్రబోయిన ప్రసన్న కుమార్ (20), కొంద్ర నిఖిల్ (20), మాటోజు ఉమేష్ ముగ్గురూ బైక్‌పై నూతన్‌కల్ మండల లింగంపల్లి గ్రామంలో ఓ వివాహ వేడుకల్లో డీజే సౌండ్స్‌కు లైటింగ్ అమర్చి తిరిగి బైక్‌పై ఇంటికి వస్తున్నారు. మార్గమధ్యలో చివ్వెంల మండల పరిధిలోని లక్ష్మణ్‌నాయక్ తండా గ్రామంలో చివ్వెంల-ముఖుందాపురం రహదారిపై పక్కన నిలిపి ఉన్న వాటర్ ట్యాంకర్‌ను బైక్ ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సూర్యాపేట ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రసన్న కుమార్ మృతి చెందాడు. నిఖిల్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఉమేష్ కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలు కాగా సూర్యాపేట ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఏఎస్‌ఐ కనకరత్నం సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విష్ణుమూర్తి తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

నల్లగొండ క్రైం: నల్లగొండ పట్టణంలోని రవీంద్రనగర్‌కు చెందిన సుంకి వెంకట్‌రెడ్డి రోడ్డుప్రమాదంలో గాయపడగా శుక్రవారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. సుంకి వెంకట్‌రెడ్డి ఈనెల 9న హైదరాబాద్ రోడ్డులో సోని మొబైల్ షాపును బంద్ చేసి బైక్‌పై రవీంద్రనగర్‌లోని తన ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో వీటీ కాలనీ నుంచి బైక్‌పై వస్తున్న మరో వ్యక్తి ఉడిపి హోటల్ వద్ద ఇతని బైక్‌ను ఢీకొనగా... వెంకట్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ ఎస్సై రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

సెల్‌ఫోన్ అప్పగింత



నర్సింహకు సెల్‌ఫోన్ అప్పగిస్తున్న పోలీస్ సిబ్బంది

మోటకొండూరు: మండల కేంద్రంలో ఓ వ్యక్తి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు తిరిగి బాధితుడికి శుక్రవారం అప్పగించారు. మోటకొండూరు మండల కేంద్రానికి చెందిన నర్సింహ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కాగా గత నెల 26న ఈయన హైదరాబాద్ నుంచి మోటకొండూరుకు వస్తుండగా రూ.17వేల విలువగల తన సెల్‌ఫోన్ పోగొట్టుకోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా.. పోలీస్ సిబ్బంది వినోద్, హబీబ్‌లు సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా గుర్తించి సెల్‌ఫోన్‌ను నర్సింహకు అందజేశారు.

భువనగిరికి చేరుకున్న దొమ్మాటి శివ మృతదేహం

- ఏప్రిల్ 30న సౌదీ అరేబియాలో గుండెపోటుతో మృతి



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

భువనగిరి: పట్టణంలోని అర్బన్‌కాలనీకి చెందిన దొమ్మాటి వెంకటేష్, వరలక్ష్మి దంపతుల చిన్న కుమారుడు శివ(28) ఐదేళ్ల క్రితం ఉపాధి కోసం సౌదీఅరేబియాకు వెళ్లాడు. అక్కడే రియాద్‌లో ఉన్న ఓ కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. గత నెల ఏప్రిల్ 30న భారత కాలమానం ప్రకారం ఉదయం విధుల్లో ఉండగా గుండెపోటు రావడంతో తోటి వారు సమీప ఆస్పత్రికి తరలించారు. అప్పటికే శివ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. శివ మృతదేహాన్ని తీసుకురావడానికి స్థానిక ఎమ్మెల్యే ద్వారా ప్రయత్నాలు చేశారు. 13 రోజులకు శివ మృతదేహం శుక్రవారం భువనగిరికి చేరుకుంది. సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. కుమారుడి మృతదేహం 13 రోజులకు రావడంతో కుటుంబ సభ్యుల రోధనలు అందరిని కలిచివేశాయి. బాధిత కుటుంబసభ్యులను ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి పరామర్శించారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య



కుంచం సంధ్యారాణి(ఫైల్)

నిడమనూరు: ఇంటర్‌లో ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురైన విద్యార్థిని ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నిడమనూరు మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన కుంచం సంధ్యారాణి(17) ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. విద్యార్థిని తండ్రి కుంచం అంజయ్య చాలా కాలం క్రితమే మృతిచెందాడు. తల్లి కూలీ పనులు చేస్తూ కూతురిని చదివిస్తోంది. ఇటీవల విడుదలైన ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ఒక సబ్జెక్టులో ఫెయిల్ కావడంతో సంధ్యారాణి మనస్తాపానికి గురైంది. శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. చదువుతో పాటు ఆటల్లోనూ చురుగ్గా ఉండే సంధ్యారాణి ఆత్మహత్య చేసుకోవడం పట్ల తోటి విద్యార్థినులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా.. సంధ్యారాణికి రెండు సంవత్సరాల క్రితం వివాహం జరగగా.. సంవత్సరానికే విడాకులు కూడా తీసుకున్నట్లు తెలిసింది.

ఆటో బోల్తా.. ఆరుగురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

చింతపల్లి: హైదరాబాద్- నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టడంతో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన ప్రకారం.. మాల్ వెంకటేశ్వరనగర్ నుంచి ప్రయాణికులతో చింతపల్లి వైపు వస్తున్న ప్యాసింజర్ ఆటో మాల్ పట్టణ సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న మధనాపురం గ్రామానికి చెందిన పగడాల పద్మమ్మ, పగడాల పోచమ్మ, పగడాల మైసమ్మలకు తీవ్ర గాయాలు కాగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మరో ముగ్గురికి స్వల్ప గాయాలు కావడంతో మాల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని మాసాయిపేట, కుమ్మరిగూడెం గ్రామాల పరిధి మధ్యలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దచెరువు సమీపంలోని బండ్ల బాటలో తాటిచెట్టు కింద ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు ఆరా తీసారు. అతడికి సుమారుగా 50 నుంచి, 55 సంవత్సరాల వయసు ఉంటుందని, చామన ఛాయ రంగు, క్రీమ్ కలర్ షర్ట్, బ్లూ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణారెడ్డి తెలిపారు.

వేసవిలో 'గోరుచిక్కుడు'కు అనుకూలం

- ఒకటి, రెండు తడులతో మంచి దిగుబడి
- కోదాడ డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి అనిత



బృందావనపురంలో సాగులో ఉన్న గోరుచిక్కుడు

పాడి పంట

నడిగూడెం: వేసవిలో ఎక్కువగా రైతులు కూరగాయల పంటలను సాగు చేస్తుంటారు. వంగ, బెండ దొండ, తోట కూర, గోంగూర, టమాట తదితర పంటలపై మొగ్గు చూపుతారు. అయితే వీటికి భిన్నంగా గోరు చిక్కుడు సాగు చేసేందుకు వేసవి సీజన్ అనుకూలమని కోదాడ డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి అనిత చెబుతున్నారు. ఈ పంట సాగుపై సలహాలు, సూచనలు ఆమె మాటల్లోనే..

అన్నిరకాల నేలలు అనుకూలం

గోరు చిక్కుడు సాగుకు దాదాపుగా అన్ని రకాల నేలలు అనుకూలం. సారవంతమైన ఎర్రగరప, ఒండ్రు నేలలు, మరింత మంచిది. అధిక సాంద్రత బరువు కలిగిన భూములు, ఉప్పు, చౌడు, నేలలు పనికిరావు. నేలను నాలుగైదుసార్లు బాగా దున్నాలి.

విత్తన శుద్ధి

కిలో విత్తనానికి రైజోబియం కల్చర్ పట్టిస్తే వేర్ల మీద ఎక్కువగా బుడిపెలు ఏర్పడి నత్రజని స్థిరీకరణ జరుగుతుంది. తరువాత వేయబోయే పంటలకు కూడా నత్రజని అందుతుంది. విత్తే ముందు కల్చర్ పట్టించి నీడలో ఆరబెట్టాలి.

విత్తేదూరం..

కొమ్మలు రాని తక్కువ కాలపరిమితి కలిగిన విత్తనం కోసం సాళ్ల మధ్య 30 సెం.మీ ఉండాలి. మధ్యస్థ కాలపరిమితి కలిగిన రకాలైతే సాళ్ల మధ్య 45 సెం.మీ ఉండాలి. విత్తిన 15 నుంచి 20 రోజుల్లోగా మొక్కల మధ్య దూరం 10 సెం.మీ. ఉండేలా పలుచగా చేసుకోవాలి.

నీటి యాజమాన్యం..

ఆరు తడి కింద వేస్తే భూమిలోని తేమను, నీటి లభ్యతను బట్టి 7 నుంచి 10 రోజులకు ఒకసారి నీరు పెడితే సరిపోతుంది. నీటి కింద అయితే ఆరుతడి పంటగా వేస్తే 20, 60, 75 రోజుల్లో పంట వయసులో నీటి తడులు ఇవ్వాలి.

ఎరువుల యాజమాన్య పద్ధతులు

ఆఖరి దుక్కిలో ఎకరాకు నాలుగు టన్నుల పశువుల ఎరువు లేదా ఒక టన్ను వర్మి కంపోస్టు చిక్కుడు పప్పు జాతి పంట అయినందుల నత్రజని అందించే ఎరువు ఎక్కువగా అవసరం లేదు. నత్రజని, భాస్వరం, తక్కువ కలిగిన నేలల్లో ఎకరాకు 8 కిలోల యూరియా, 100 కిలోల సూపర్ పాస్ఫేట్ వేయాలి.

కలుపు నివారణ

విత్తిన 20- 25 రోజుల సమయంలో కలుపు తీయాలి. లేదంటే 80 శాతం దిగుబడులు తగ్గుతాయి. అవసరమైతే 40 లేదా 45 రోజులకొకసారి మరోసారి కలుపు తీయించాలి. పెండిమిథాలిన్ అనే కలుపు మందును 400-600 గ్రాములు 200 లీటర్ల నీటికి కలిపి ఎకరం పొలంలో పిచికారీ చేయాలి.

సస్యరక్షణ చర్యలు

చిక్కుడు పంటకు చీడ, పీడల బెడద తక్కువ. మొండి పంట కావడంతో పేనుబంక పురుగులు తక్కువగా ఆశిస్తాయి. కాబట్టి లీటరు నీటికి 1.5 గ్రాములు ఎసిఫేట్ కలిపి పిచికారీ చేయాలి.

పంట దిగుబడి

ఒక ఎకరానికి 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. మార్కెట్ ధర కూడా ఆశాజనకంగానే ఉంటుంది.

మెప్మా ఆర్‌పీ బూతు పురాణం

- సమభావన సభ్యురాలి భర్తకు ఫోన్ చేసి దుర్భాషలాడిన రిసోర్స్ పర్సన్

దురాజ్‌పల్లి (సూర్యాపేట): సమభావన సంఘంలోని పొదుపు డబ్బులు చెల్లించే విషయంలో సంఘం సభ్యురాలి భర్తకు మెప్మా రిసోర్స్ పర్సన్ ఫోన్ చేసి దుర్భాషలాడిన సంఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బాలాజీ నగర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. పట్టణ కేంద్రంలో ఎస్‌ఎల్‌ఎఫ్- 2 పరిధిలోని కౌండిన్య సమభావన సంఘం సభ్యురాలు చల్లా భవానికి 2023 మార్చిలో శ్రీనిధి ద్వారా రూ.లక్ష రుణం అందించారు. సభ్యురాలు తన వాయిదా రుణం ఏప్రిల్ 11వ తేదీన రూ.5వేలు, మే 4న రూ.5వేలు శ్రీనిధి ఖాతాల్లో జమచేసింది. ఇదిలా ఉండగా.. పొదుపు డబ్బులు చెల్లించే విషయంలో ఆర్‌పీకి సంబంధం లేకున్నా.. ఆమె సంఘం సభ్యురాలి భర్తకు ఫోన్ చేసి దుర్భాషలాడింది. అయితే భవానికి రుణం మంజూరు చేసినప్పుడు రూ.2 వేలు తనకు లంచంగా ఇవ్వాలనికి ఆర్‌పీ డిమాండ్ చేసిందని, దీనికి తాను నిరాకరించడంతో వ్యక్తిగతంగా కక్ష పెంచుకుందని భవాని తెలిపింది. తనకు సంబంధం లేని పొదుపు డబ్బులను సాకుగా చూపి ఇలా దుర్భాషలాడిందని వాపోయింది.

విచారించి చర్యలు తీసుకుంటాం

సమభావన సభ్యురాలి భర్తతో ఆర్‌పీ దుర్భాషలాడిట్లు ఫిర్యాదు అందింది. సంఘాల సభ్యుల పొదుపు సొమ్ము చెల్లింపు పూర్తిగా తమ వ్యక్తిగతం. పొదుపు రికవరీకి ఆర్‌పీకి ఎలాంటి సంబంధం లేదు. దుర్భాషలాడి, బెదిరింపులకు పాల్పడిన విషయంపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.

– రమేష్‌నాయక్, మెప్మా పీడీ